# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు




## -32-
## గొప్పవాళ్లూ- చమత్కారాలూ

అసలు కాస్తో, కూస్తో అన్నిటా వక్ర దృష్టి ఉంటేనే తప్ప చమత్కారంగా మాట్లాడడం ఎవరికీ రాదు అని మొన్ననే ఎక్కడో చదివి, పొరపాటున మా క్వీన్ విక్టోరియా కి చెప్పగానే ఆవిడ అరక్షణం ఆలోచించకుండానే

"నీ విషయం లో అది సగం తప్పు, డియర్ మొగుడూ" అంది.

"అయితే సగం రైటన్న మాటేగా" అని తిప్పికొట్టాను కానీ అది నాకే దెబ్బ తగులుతుంది అనుకోలేదు.

"అవును. అందులో మొదటి సగం రైటే" అనేసింది ఠకీమని.

అనగా, భవదీయుడికి అన్నిటా వక్ర దృష్టి ఉండుట నిజమే అనియూ కానీ ఆ రెండో భాగం ..అనగా చమత్కారంగా మాట్లాడుట నిజం కాదు అనియూ ఆవిడ అభిప్రాయం అనియూ నాకు అర్థం అయిపోయింది. నేను కాస్త మాత్రమే వక్రదృష్టి కలిగి ఉండుటయే కాక చమత్కారంగా మాట్లాడతాను అని ఎలా నిరూపించుకోవాలో తెలియక ఒక దొంక తిరుగుడు మార్గం కనిపెట్టాను. అదేమిటంటే, కొందరు గొప్ప వాళ్ళ చమత్కారాలు సేకరించి, వాళ్ళకి కాస్తో, కూస్తో వక్ర దృష్టి ఉండబట్టే అలా మాట్లాడారు కాబట్టి నేనూ అంతే అని వాదిద్దాం అని నా ప్రతిపాదన. ఇక్కడ రహస్యం ఏమిటంటే ఆ గొప్ప వాళ్ళకి వక్రదృష్టి లేనే లేదు కానీ నేనేదో వాళ్ళతో చిన్నప్పుడు గోలీక్కాయలు ఆడుకున్నట్టు ఉత్తుతినే అలా అంటానన మాట!. ఏమో, ఆవిడ నమ్మినా నమ్మ వచ్చు, గుర్రం ఎగరా వచ్చు కదా1

ఉదాహరణకి ఒకాయన "ఈ భూప్రపంచం లో చచ్చి పోయిన తర్వాత కూడా చచ్చే బోరు కొట్టించే ఏకైక వ్యక్తి రచయితే" అన్నాడు. "అవునులే. ఆయన నీ బోటి తెలుగు రచయితల గురించి అని ఉంటాడు" అంది మా క్వీన్ విక్టోరియా.

ఆవిడ మాటలకేంగానీ ప్రముఖుల చమత్కారాలు, శ్లేషలు అనగానే నాకు ముందు శ్రీశ్రీ గారే గుర్తుకొస్తారు...ముఖ్యంగా ఎవరి ప్రశ్నకైనా ఆయన ఇచ్చిన సమాధానాలు భలే ఉంటాయి. ఇవన్నీ నేను ఎక్కడో అక్కడ చదివి కాపీ కొట్టినవే. ఆయనా, ఆయన సతీమణి సరోజ గారూ ఇంచుమించు ముప్ఫై ఏళ్ల క్రితం అమెరికా వచ్చినప్పుడు నాకు స్వయంగా చెప్పినవి కూడా ఇంకా చాలా ఉన్నాయి.

"జనన మరణాల మీద మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగితే "నా అభిప్రాయంతో నిమిత్తం లేకుండానే ఇదివరలో ఇవి సంభవించాయి. ఇక మీద కూడా సంభవిస్తూనే ఉంటాయి." అన్నారు ఆయన. అలాంటివే మరి కొన్ని:

"రాతల్లో బోలెడు నీతిని ప్రబోధించే మీరు నీతిగా ఉంటారా ? –

""దారికి దారి చెబుతూ రోడ్ మీద బోర్డ్ ఉంటుంది. ఆ రోడ్ వెంట మనం వెళ్ళాలి గానీ ఆ బోర్డు వెళ్ళదు కదా !

"దేశంలో లంచాలు తీసుకునే వాళ్ళందర్నీ ఉరి తీసేస్తే....... –

"లంచాలిచ్చేవాళ్ళు మిగులుతారు."

"భగవంతుడ్ని ప్రార్థించేటపుడు కళ్ళెందుకు మూసుకుంటారు ? –

"తమది గుడ్డి నమ్మకం అని తెలియజేయ్యడానికి."

"మీరు ఒక పాట రాసినందుకు ఎంతిస్తారు?"

"ఏమీ ఇవ్వను".

"మన దేశం లో సతీ సావిత్రి, సీతా దేవి, అనసూయ లాగే అమెరికాలో కూడా అటువంటి పతివ్రతలున్నారా?

"అలాంటి వారు కాదు కానీ, మే వెస్ట్, క్లారా బే, మేర్లిన్ మన్రో, రీటా హేవర్త్ లాంటి వాళ్లు చాలా మందే ఉన్నారు."

ఇంకొక రకం ఛలోక్తి:

ఓ పెద్దాయన ఓ కుర్రాడితో "నువ్వు రోజూ భోజనం చేసే ముందు ప్రార్ధన చేస్తావా?: అని అడిగాడు.

వెంటనే ఆ కుర్రాడు "లేదు. మా అమ్మ బాగా వంట చేస్తుంది" అన్నాడు. ఇక్కడ ఎవరికీ వక్రదృష్టి లేదు మరి.

ఇటీవలి సంగతి:

ఒక చిన్న కుర్రాడు స్కూల్ అయిపోగానే బయట దీనంగా కూచుని ఉన్నాడుట. అది చూసి ఒకాయన "ఏం. మీ నాన్న నిన్ను పికప్ చేసుకోడానికి రావడం లేదా" అని అడిగాడు.

"నాకు నాన్న లేదు" అన్నాడు ఆ కుర్రాడు.

"అయ్యో, మరి మీ అమ్మ వస్తుందా?" అడిగాడు ఆయన విచారంగా.

"నాకు అమ్మ లేదు" సమాధానం చెప్పాడు కుర్రాడు.

"అయ్యయ్యో. మరి నీ కోసం ఎవరు వస్తారు?" బాధగా అడిగాడు ఆ పెద్దాయన.

"మమ్మీ కాని, డాడీ కాని వస్తారు. ఇవాళ కాస్త లేట్" అని చెప్పాడు ఆ కుర్రాడు. ఇప్పుడు నవ్వడం మాట దేవుడెరుగు..నిర్ఘాంత పోవడం మనందరి వంతూ కదా!

మొక్కపాటి వారి చమత్కారాలు:

ఒకసారి మొక్కపాటి వారిని ఒకాయన "ఇప్పుడేం రాస్తున్నారూ?" అని అడిగాడు.

"ఏమీ తోచక ఒంటికి నూనె రాస్తున్నాను" అన్నారు 80 ఏళ్ళ మొక్కపాటి వారు. ఏ రచయితకి అయినా ఆ వయసులో అలాంటి ప్రశ్న వింటే మరి చికాకు వెయ్యదూ?

అలాగే మరొకాయన "ఇప్పుడేం చేస్తున్నారూ?" అని అడగ్గానే "అప్పులు" అని ఠకీమని సమాధానం ఇచ్చారు అదే మొక్కపాటి వారు.

విశ్వనాధ వారి క్లాసిక్:

ఒక హరి కథ భాగవతార్ గారు విశ్వనాధ వారి దగ్గరకి వచ్చి "అయ్యా, మీ ఊళ్లో హరికథ చెప్తానండి" అన్నారు.

"మరి మీ ఊళ్లో చెప్పారా?" అని అడిగారు విశ్వనాధ.

"లేదండి." అని సమాధానం వచ్చింది.

"ఎంచేతా?' అడిగారు మహాకవి.

"మా వాళ్లు చెప్పించుకోరండి" అన్నారు భాగవతార్ గారు.

" మరి మా వాళ్లు చెప్పుచ్చుకుంటారే, ఎలాగా?" అన్నారు విశ్వనాధ గారు.

మరొక విశ్వనాధ క్లాసిక్:

ఆయన బందరులో ఉండేటప్పుడు ఒకాయన కొత్తగా బందరు వచ్చి, విశ్వనాధ గారితో "మీ బందరులో గాడిదలు ఎక్కువగా ఉన్నట్టున్నాయే" అన్నాడు. దానికి విశ్వనాధ "అబ్బే, ఇక్కడివి తక్కువేనండి. కానీ బయట నుంచి వచ్చేవే ఎక్కువ" అన్నారు.

చలం గారు చెప్పిన జ్యోతిష్కం ఛలోక్తి:

ఒక జ్యోతిష్కుడు ఒకాయనతో "మీకు గొప్పతనం, భాగ్యం అన్నీ 32వ ఏటే లభిస్తాయి" అన్నాడుట.

"మరి ఆయుష్షు?" అని అడగగానే

"29" అని చెప్పాడుట ఆ జ్యోతిష్కుడు.

అబ్బూరి రామకృష్ణ రావు గారి హాస్యం:

అబ్బూరి వారు చాల చమత్కారంగా మాట్లాడే వారు. ఒకసారి రావి శాస్త్రి గారు వ్రాసిన నాటకం ప్రదర్శన అయ్యాక ఆయన అబ్బూరి గారి తో "ఇందులో సన్యాసి రాజు పాత్ర చాలా బాగా వ్రాశాను కదా!" అన్నారుట కాస్త స్వోత్కర్ష తో.

దానికి అబ్బూరి "పప్పు చారులో ఉప్పు ఒకటే బావుంది అంటే ఎలాగోయ్, మొత్తం చారు అంతా బావుండాలి కదా!" అన్నారు అబ్బూరి.

అబ్బూరి గారికి ఒకసారి పింగళి, కాటూరి వ్రాసిన "సౌందర నందనం" కావ్యం ఆవిష్కరణకి ఆహ్వానం రాగానే పక్కనే ఉన్న బొమ్మగంటి వారితో ""కావ్యాలకి ఆవిష్కరణలు, స్వీకారోత్సవాలు, రజతోత్సవాలు జరుపుతున్నారు బాగానే ఉంది కానీ అవి జనం చదవడం మానేసినప్పుడు దహనోత్సవం ఎందుకు చెయ్యరు" అన్నారు. అది విన్న మిత్రులు వెల్చేరు నారాయణ రావు గారు "కావ్య దహనోత్సవం" అనే నాటిక వ్రాసి ఏలూరులో వెయ్యడం చెపుకోదగ్గ పరిణామం. ఈ రోజుల్లో అయితే కావ్యాలకే కాదు, చాలా కథలకీ, కవితలకీ, నవలలకీ దహనోత్సవాలు చేస్తే మిగతా కార్యక్రమాలకి సమయం ఉండదు! అన్నీ పుబ్బలో పుట్టి మఘలో మాడిపోతున్నవే! అలాగే ఆయన కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ గా ఉన్నప్పుడు మంచి చేసుకుని మార్కులు వేయించుకోడానికి సిఫార్సులతో కొంత మంది వచ్చే వారు. వాళ్ళని ఆయన "మార్క్సిస్టులు" అనే వారు.

అబ్బూరి వారి కుమారుడు వరద రాజేశ్వర రావు గారు చమత్కారాలలో కూడా తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న గొప్ప రచయిత. ఆయనకి అధికార భాషాసంఘం అధ్యక్షుడి పదవి ఇచ్చినప్పుడు "ఈ వయసులో రంభ ని ఇస్తే ఏం చేసుకోను?" అనడం కానీ, "అది పాత చింతకాయ పచ్చడి లాంటిది. జబ్బు చేసిన వాళ్ళకే ఇస్తారు" అనడం కానీ ఆయనకే చెల్లింది.

ఇక బాపు-ముళ్ళపూడి ల హాస్యోక్తులు ఒకటా, రెండా...ఒకసారి నేను మద్రాసు వెళ్ళినప్పుడు బాపు గారిని పిలిచి "మీకూ, రమణ గారికీ నమస్కారం పెట్టుకునే పని ఉంది. ఎప్పుడు రమ్మంటారు, గురువు గారూ?" అని అడిగాను.

ఆయన నవ్వుతూ "పగలైతబాగా కనపడతాం. పదకొండింటికల్లా వచ్చెయ్యండి...పప్పు కూడా తినొచ్చు" అన్నారు బాపు గారు.

నేను "ఇదేదో భలే బావుంది సార్..మరి సాయంత్రం అయితేనో?" అన్నాను కాస్త టీజింగ్ గా.

"సాయంత్రం అయితే గూడ కట్టు కట్టుకుని వచ్చెయ్యండి. మడత మంచం వేయిస్తాను" అన్నారు ఆయన నవ్వుతూ.

"ఆ పని నాకు రాదు సార్, పొద్దున్నే వస్తాను" అని యాయవారం కుదుర్చుకుని ఆ మర్నాడు పొద్దున్నే వెళ్ళాను కానీ పది నిముషాలు ఆలస్యం అయింది నా ప్రాణాలకి. అప్పటికే బాపు గారు బయట పోర్టికో లో చీటికి మాటికీ చేతి వాచ్ చూసుకుంటూ పచార్లు చేసేస్తున్నారు. బాపు గారి సమయ పాలన అందరికీ తెలిసినదే. నేను గబగబా కారు దిగి "సారీ సార్. లేటయింది" అంటూండగానే ఆయన "పరవా లేదు రాజూ గారూ. మీ అమెరికా

వాళ్ళు మా ఇండియా వాళ్ళ కంటే ఎప్పుడూ వెనకే ఉంటారు గా" అన్నారు నవ్వుతూ. అంటే అమెరికా ఇండియా కంటే ఎప్పుడూ పది, పదిహేను గంటలు వెనకాలే ఉంటుంది కదా! అదీ ఆయన పన్!

అలాగే ఒకసారి మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు ముళ్ళపూడి వారి బలవంతం మీద ఆయన ఇంటికి వెళ్ళి కొన్నాళ్ళు ఉన్నారు. మల్లాది వారంటే ముళ్లపూడి వారికి ఆరాధనా భావం. ఆయన ఆతిధ్యం అయ్యాక మల్లాది వారు బందరు వెళ్లి పోతూ "రమణా మీ ఇంట్లో ఉన్న రెండు రోజులూ రెండు క్షణాలుగా గడిచి పోయిందయ్యా" అన్నారు కాస్త విచారంగా. దానికి వెంటనే రమణ గారు "మరో రెండు క్షణాలు ఉండకూడదూ?" అని బతిమాలారుట. అంటే మరో రెండు రోజులన మాట! అదీ సమయ స్ఫూర్తి అంటే!

ఇలా చెప్పుకూంటూ పోతే తెలుగులో దేవులపల్లిగారు, కట్టమంచి వారు, చలం, విశ్వనాధ, రావి శాస్త్రి మొదలైన గొప్పవాళ్ళ చమత్కారాల మీద చాలా పుస్తకాలే వ్రాసి, జన్మ ధన్యం చేసుకోవచ్చును. అలా ధన్యులైన వారిలో నాకు బాగా తెలిసిన వారు శ్రీ రమణ, సి. మృణాళిని. ఈ నాటి ప్రముఖుల చమత్కారాలు సేకరించి ఓ పుస్తకం వేద్దాం అని నాకూ ఒక కోరిక ఉంది కానీ, ఈ రోజుల్లో ఎవరు ప్రముఖులో తెలియడం లేదు. ఎవరికి వారే గొప్ప వాళ్లు మరి!

COMMENTS